TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక :18 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.12.08.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

## నేడు హ్యామ్ ప్రాజెక్ట్‌పై రోడ్ షో



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. జాతీయ రహదారులకు తీసిపోని విధంగా నిర్మించేందుకు హైబ్రిడ్ అన్యూయిటీ మోడ్ (హ్యామ్) విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నది. మంగళవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ న్యాక్ ఆడిటోరియంలో హ్యామ్ ప్రాజెక్ట్ రోడ్‌షో కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్నది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే షో కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ప్రభుత్వ విజన్, ప్రాజెక్టు విధివిధానాలు, ప్రత్యేకతలు, ప్రణాళికలు, నిర్మాణకాలం, అర్హత, ఎంపిక విధానం అంశాలను వివరించే హ్యామ్ ప్రాజెక్ట్ రోడ్ షోలో దేశ వ్యాప్తంగా బ్యాంకర్లు, కాంట్రాక్టర్లు, వర్క్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొనున్నారు. ఇది ఒక రకంగా ప్రీ-బిడ్ మీటింగ్ తరహాలో ఉండే సమావేశమని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు.

15 ఏండ్లు కాంట్రాక్టర్లదే బాధ్యత

హ్యామ్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ వాటా 40 శాతం కాగా మిగిలిన 60 శాతం నిధులను కాంట్రాక్టర్లు, ఏజెన్సీలే సమీకరించాలి. 15 ఏండ్ల పాటు రోడ్ల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లదే. గతంలో హ్యామ్ విధానం కేవలం జీహెచ్ఎంసీలోనే అమలయ్యేది. గ్రేటర్‌లో విజయవంతమైన ఈ విధానాన్ని గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తరించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ఆదేశాలతో నాలుగు నెలలుగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం హ్యామ్ ప్రాజెక్టుపై కసరత్తులు చేసింది. ఆయా రాష్ట్రాల్లో హ్యామ్ ప్రాజెక్టుల్లో అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నివేదిక సమర్పించింది. ఎక్కడా ప్రజలకు ఈ రహదారుల మీద టోల్ వంటి చార్జీల భారం లేకుండా హ్యామ్ ప్రాజెక్టు డిజైన్‌ను రూపొందించారు. జాతీయ రహదారులతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, యూపీ వంటి 12 రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతమైన విషయం విదితమే.

రాష్ట్రంలో మూడు విడతల్లో 18,472 కిలోమీటర్ల గ్రామీణ రహదారులు హ్యామ్ విధానంలో నిర్మించేందుకు తెలంగాణ క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. మొదటి విడతలో 7,947 కిలోమీటర్లకు సంబంధించి 2,254 రహదారులకు గ్రీన్‌సిగల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయాలను, ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదిత రహదారి పనులను గుర్తించారు. గ్రామపంచాయతీ స్థాయి నుండి జిల్లా కేంద్రం వరకు అన్ని స్థాయిల్లో రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటివరకూ రోడ్డు సౌకర్యానికి నోచుకోని గ్రామాలకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతమున్న రహదారులను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించనున్నారు. 30 టన్నుల వాహనాల రాకపోకలకు అనుగుణంగా రహదారులను తీర్చిదిద్దుతారు. ఇది ప్రజలకు మెరుగైన కనెక్టివిటీని కల్పించడంతోపాటు, అభివృద్ధికి బలమైన బాటవేస్తుంది. దీంతో తెలంగాణ రహదారుల రంగంలో ఒక మహర్దశ ప్రారంభమైనట్లేనని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. తాజా రోడ్‌షోలో హ్యామ్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను బ్యాంకర్లు, వర్క్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అధికారులు వివరిస్తారు. అనుమానాలను నివృత్తి చేస్తారు. సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు.

పక్కా రోడ్ల నిర్మాణానికి ఉత్తమ మార్గం హ్యామ్

తెలంగాణ రాష్ట్ర ఖజానాపై తక్కువ భారం పడేలా, వేగంగా, అత్యుత్తమ నాణ్యతతో రోడ్ల నిర్మాణం కావాలంటే హ్యామ్ మోడల్ బెస్ట్. దేశంలోని పలు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలై, 20 నుంచి 25 ఏళ్ల పాటు చెక్కు చెదరని రోడ్లను అందించే ఈ విధానం ఇప్పుడు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు కొత్త జీవం పోయబోతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 68,539 కిలోమీటర్ల గ్రామీణ రహదారుల్లో సుమారు 30 వేల కిలోమీటర్లు ఇప్పటికీ మట్టి, కంకర రోడ్లే. ఈ పరిస్థితి మారాలి. పల్లెలకూ జాతీయ రహదారి స్థాయిలో రవాణా సౌకర్యం కల్పించాలన్నదే మా లక్ష్యం. ప్రజలపై రూపాయి అదనపు భారం లేకుండానే ఈ మార్పు సాధ్యం కాబోతున్నది. నిర్మాణం నుంచి నిర్వహణ వరకూ పూర్తి బాధ్యత ఏజెన్సీలదే. ప్రభుత్వ విజన్‌ను అందరికీ వివరించే హ్యామ్ ప్రాజెక్ట్ రోడ్ షోను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం – మంత్రి సీతక్క

## బీసీలను వంచించే కుట్రకు తెరలేపిన కాంగ్రెస్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలను వంచించాలని చూస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల జాగృతి కార్యాలయంలో పలువురు బీసీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడమంటే వాటిని అటకెక్కించడమేనని విమర్శించారు. ఎన్నికల ముందు ఇదే విషయాన్ని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారినే మోసం చేస్తోందని ఆరోపించారు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమనేది కంటితుడుపు చర్య మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని ప్రజల్లో ఎండగడతామని స్పష్టం చేశారు.

## బీసీ రిజర్వేషన్ కోసం బీఆర్ఎస్ 'కదన భేరి'



కరీంనగర్ :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఈనెల 14న కరీంనగర్‌లో 'బీసీ కదన భేరి' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు గురుకులాలు ఏర్పాటు చేసి, కులవృత్తులకు వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించొద్దని డిమాండ్ చేశారు. అనంతరం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా అని ప్రశ్నించారు. వంద మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. 'బీసీలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్టీసీ చైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బీసీలకు అవకాశం ఇచ్చింది కేసీఆర్' అని తెలిపారు. మంత్రులుగా కూడా బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమే అని చెప్పారు. తదనంతరం శాసన మండలి పక్ష నేత మధుసూదనచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహా పలువురు నేతలు మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, ఎల్.రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినరు భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకులాభరణం కృష్ణమోహన్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్‌బాబు, విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

## రాష్ట్ర గౌరవాన్ని దేశ స్థాయిలో నిలబెట్టాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర గౌరవాన్ని దేశ స్థాయిలో నిలబెట్టేందుకు యువత కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రానికి హ్యూమన్ రిసోర్స్ బలమైన పెట్టుబడి అని తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ, సన్మాన కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి పాల్గొన్నారు. సివిల్స్ -2025 మెయిన్స్‌కు ఎంపికైన 178 మంది అభ్యర్థులకు రూ. లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సివిల్స్ -2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ ఐఏఎస్ ఆఫీసర్ల సేవలు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. సీనియర్ ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్, కాకి మాధవరావును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారి సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటారని వివరించారు. రాష్ట్రం నుంచి అత్యధిక మంది మెయిన్స్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అందుకోసం ఏం చేయడానికైనా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. నిబద్ధతతో పని చేసే వాళ్లు చరిత్రలో నిలిచిపోతారని గుర్తు చేశారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. మానవీయ కోణంలో పేదల జీవితాల్లో మార్పులకు కారణమైతేనే మన జీవితానికి సార్థకత ఉంటుందని తెలిపారు. లక్ష్యాలు ఎంత గొప్పవయినా అవి ప్రజలకు చేరకపోతే..ఉపయోగం లేదన్నారు. ముందున్న ప్రతి సవాల్‌ను స్వీకరించాలనీ, సమాజాభివృద్ధి కోసమే ఉండాలన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ మంచి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వం సివిల్స్ అభ్యర్థులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, రాజ్‌ఠాకూర్‌సింగ్ మక్కన్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ ఎనర్జీ ప్రిన్స్‌పల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రీప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలనీ, విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) అనుబంధం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్కకు మెయిల్, వాట్సాప్ ద్వారా లేఖలు పంపారు. విద్యావాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీలకు అదనంగా ఇవ్వాలని కోరారు. ఆరేండ్ల లోపు పిల్లలకు ప్రయివేటు స్కూళ్లను నడపడానికి అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఐసీడీఎస్‌కు సంబంధంలేని బీఎల్ఓ తదితర అదనపు పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1975లో ప్రారంభమైన ఐసీడీఎస్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు పొందిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎల్‌సీతో పాటు కాగ్, యునిసెఫ్ తదితర సంస్థలు సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2022లో సుప్రీం కోర్టు అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలనీ, 2024లో గుజరాత్ హైకోర్టు వారిని పర్మినెంట్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. 1995 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పౌష్టికాహారంతో పాటు విద్యను అందించే ఈసీసీఈ కేంద్రాలు(ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)గా మార్చాలని అంగన్‌వాడీలు అడుగుతున్నారనీ, దానికి ఆటంకంగా ఉన్న బీఎల్ఓ, ఐసీడీఎస్‌కు సంబంధం లేని అదనపు పనులు రద్దు చేయాలని కోరుతున్నారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకోకుండా ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం తగదని సూచించారు. ఇంటర్మీడియట్‌తో పాటు ఆపై చదువులు చదివిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త విద్యావాలంటీర్లను నియమిస్తామనటం సబబు కాదని పేర్కొన్నారు.

ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రయివేటు స్కూళ్లు నడపడానికి అనుమతి ఇవ్వకూడదని కోరారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని కోరారు.

## పాతదే కొత్తగా 'సారథి'




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రవాణాశాఖ తమ వినియోగదారులకు మరింత పారదర్శకంగా, మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'సారథి' పోర్టల్‌ను అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత ప్రయోగాత్మకంగా తిరుమలగిరి, ఆ తర్వాత ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసుకు ఈ సేవలను విస్తరించింది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ఆర్టీఏ కార్యాలయాలకు విస్తరించే పనులు చేపట్టింది. తద్వారా వాహన యజమానులకు సంబంధించిన లర్నింగ్ లైసెన్స్, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రెన్యూవల్, చిరునామా మార్పు, తదితర సేవలన్నీ ఎప్పుడైనా ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లోనే పొందే వీలుంది. కానీ సారథి పోర్టల్, స్లాట్ బుకింగ్స్ ఎలా చేసుకోవాలి అనే అంశాలపై ఎక్కడా వినియోగదారులకు అవగాహన కల్పించకలేదు. దాంతో స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్స్ అప్‌లోడ్ సమయంలో ఎదురవుతున్న టెక్నికల్ సమస్యలకు సకాలంలో పరిష్కారమూ చూపకపోవడంతో వినియోగదారులు రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరుగుతూ నానాయాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని ఆఫీసుల్లో వస్తున్న టెక్నికల్ తప్పులకు మార్గం చూపించకుండా.. రవాణా శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రమంతా విస్తరణ కు చర్య లు తీసుకోవడం వల్ల ఇబ్బందులు తప్పవనే అభి ప్రాయం వ్యక్త మవుతోంది. ఎవరో ఒత్తిడికి తలొగ్గి విస్తరణకు చర్యలు తీసుకుంటే వినియోగదారులు, వాహన యాజమానులే బలవుతారని విషయాన్ని అధికారులు గుర్తించాలని చెబుతున్నారు.

ఇప్పటివరకు రాష్ట్ర రవాణాశాఖ సిటీజన్ ఫ్రెండ్లీ సర్వీసెస్ ట్రాన్స్‌పోర్ట్(సీఎఫ్ఎస్‌టీ) పోర్టల్ ద్వారా వివిధ రకాల పౌర సేవలను అందచేసింది. మరింత పారదర్శకమైన సేవల కోసమంటూ కేంద్రం పరిధిలోని సారథిలోకి 5 నెలల క్రితం ప్రవేశించింది. మార్చి 30న ఈ పోర్టల్‌ను సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి ఆర్టీఏ ఆఫీసులో ప్రయోగాత్మకంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. గత నెల 26న ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసుకు సారథి సేవలను విస్తరించారు. అనంతరం సిటీలోని అన్ని ఆఫీసుల్లోకి విస్తరించగా.. ఇప్పుడు రాష్ట్రమంతా ఈ సేవలను విస్తరించేలా ఆర్టీఏ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఈ పోర్టల్ ద్వారా ఆర్టీఏకు సంబంధించిన సుమారు 20 వరకు సేవలు పౌరులకు అందుబాటులో ఉన్నాయి. అయితే తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో చిన్న చిన్న పనుల కోసం గంటలు, రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నట్టు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అంతేగాక ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ సమయంలో అవసరమైన డాక్యుమెంట్లు, ఫొటోలను సారథిలో అప్‌లోడ్ చేసుకోవాలన్నా గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఉదాహరణకు ఖైరతాబాద్ ఆర్టీఏ పరిధిలో నివసించే ఓ వ్యక్తి వారం రోజుల క్రితం అమెరికా నుంచి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ రెన్యూవల్ కోసం సారథి అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కావాల్సిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి.. నిర్దేశిత ఫీజు చెల్లించారు. ఐడీపీ రెన్యూవల్‌కు అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లతో పాటు విదేశాల్లో ఉన్నట్టు ధ్రువీకరించే లెటర్ ఇండియన్ ఎంబసీ ద్వారా తీసుకుని లైసెన్స్ రెన్యూవల్‌కు తన తల్లిదండ్రులను ఆర్టీఏ కార్యాలయానికి పంపించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన అధికారులు ఐడీపీ కావాలనుకునే వ్యక్తి ప్రత్యక్షంగా వచ్చి ఫొటో, సిగేచర్ చేస్తేనే రెన్యూవల్ ప్రోసిజర్ పూర్తవుతుందని చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. సారథి ద్వారా ఎక్కడినుంచైనా స్లాట్ బుక్ చేసుకొని.. రెన్యూవల్ చేసుకునే వీలుందని చెప్పారు కదా అని అడగ్గా.. అది 'ఫేస్‌లెస్' సేవలు అమలులోకి వచ్చిన తర్వాతే అని చెప్పడంతో వారు విస్మయానికి గురయ్యారు. నగరానికి చెందిన మరో వ్యక్తి పాత డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు కోసమని స్లాట్ బుక్ చేసుకుంటే.. ఎప్పుడో ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వెళ్లింది.

# లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులకు గురి చేసి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు, రిమాండ్ - ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్.

**ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేసి, ఆరోపణలు చేసి 30,000 దండుకున్న నిందితుడు.**
**బాధితుడు (ప్రభుత్వ అవుట్సోర్సింగ్ ఉద్యోగి) పై, తమ పై అధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ మహిళ ను వేధించావంటూ ఆరోపణ.**
**వాహనం తాకట్టుపెట్టి మరి 30,000 అందజేసిన బాధితుడు.**


చాకటి కిరణ్ ఫైల్ ఫోటో




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ నిందితుని వివరాలు చాకటి కిరణ్ s/o భూమన్న, వయసు: 34 సం.,, నివాసం: వాఘపూర్ విలేజ్ ఆదిలాబాద్ మండలం . వివరాలలో

ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బాధితుడు వేష్కర్ రవికుమార్ s/o లక్ష్మణ్ ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, బాధితుడు తెలిపిన వివరాలు గత నెల 21వ తారీకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కలెక్టర్ కార్యాలయం, ఆదిలాబాద్ సమీపంలో ఒక మహిళ లిఫ్టు కోరగా, తన ద్విచక్ర వాహనంలో ఎక్కించుకొని ఆమె చెప్పిన ప్రకారం జడ్జి గారి ఇంటి వద్ద గల కైలాష్ నగర్ దగ్గర దింపడం జరిగిందని ఆ మహిళ ఆతని ఫోన్ నెంబర్ తీసుకుందని, తర్వాత 23 తారీకున ఉదయం 11 గంటలకు చాకటి కిరణ్ (వాగాపూర్ గ్రామం) అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్ నెంబర్ కు కాల్ చేసి తన మరదలికి ఫోన్లో వేధిస్తున్నావు అని ఆరోపిస్తూ, నీపై ధర్నా చేస్తాము మరియు నీ పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాము, అలా చేయకుండా ఉండాలంటే 50 వేల రూపాయలను ఇవ్వాలని, లేనియెడల అతనిపై దాడికి పాల్పడతానని అదేవిధంగా అతని పై అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించగా. భయంతో ఫిర్యాదుదారుడు తన వాహనం ను ఒక వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి 30 వేల రూపాయలను తీసుకొని అదే రోజు సాయంత్రం తనకు అందజేయడం జరిగిందని డబ్బు తీసుకున్న చాకటి కిరణ్ అక్కడి నుండి వెళ్లిపోవడం జరిగిందని తెలిపారు. తదుపరి కుటుంబ సభ్యులైన తన తండ్రి రిటైర్డ్ ఎస్సై లక్ష్మణ్ కు తెలియజేయగా వెంటనే పోలీసు అధికారులను సంప్రదించి ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ఈరోజు నిందితున్ని చాకటి కిరణ్ ను అరెస్టు చేయడం జరిగింది అని, రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. బెదిరింపులకు పాల్పడే వారిపై, బెదిరించి డబ్బులు తీసుకుని వ్యక్తులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆదిలాబాద్ ఒకటవ పట్టణ సీఐ బి సునీల్ కుమార్ హెచ్చరించారు. లిఫ్ట్ ఇచ్చినందుకు బాధితున్ని వేధించి, చంపేస్తానని బెదిరించి మహిళను వేధించామంటూ ఆరోపణలు చేసి అతని వద్ద నుండి 30,000 రూపాయలను తీసుకున్న నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. బాధితుడు బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఔట్సోర్సింగ్ ఉద్యోగి గా ఉద్యోగం నిర్వహించడం జరుగుతుందని, ఇతని ద్వారా భయభ్రాంతులకు గురై 30 వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.


ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులంతా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి వచ్చిన ఉపాధ్యాయుల ఫేసియల్ రికగ్నైజింగ్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కలెక్టరేట్ కార్యాలయం లోని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఛాంబర్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలనీ అన్నారు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రం లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్నామని అందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకలకు వచ్చే అతిథికి పొలిసు గౌరవ వందనంతో పాటు పొలిసు బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. వేడుకల సందర్భంగా విద్యుత్ అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# జక్కుల సంజీవ్ కుటుంబాన్ని పరామర్శించిన డీవీఎంసీ మెంబర్ శశికాంత్




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జక్కుల సంజీవ్ కుటుంబాన్ని పరామర్శించిన డీవీఎంసీ మెంబర్ శశికాంత్ గుడిహత్నూర్ మండల కేంద్రం లోని సితగొంది గ్రామానికి చెందిన జక్కుల సంజీవ్ మాతృమూర్తి స్వర్గస్తులైన కుటుంబాన్ని సితగొంది గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. పరమర్శించినవారు మాల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న శ్రీ నారాయణ క్రాంతి కుమార్ నర్సింగ్ గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు జక్కుల లింగన్న పాల్గొన్నారు.

# చూపున్న మాట

## పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు.. ఇంటర్నల్ మార్కులపై విద్యాశాఖ నిర్ణయం

అమృత్ తెలంగాణ న్యూస్ హైదరాబాద్: పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలు (TG SSC Exams) నిర్వహిస్తామని తెలంగాణ విద్యాశాఖ వెల్లడించింది. 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. పదో తరగతి పరీక్షల్లో 80 శాతం ఎక్స్టర్నల్ మార్కులు, 20 శాతం ఇంటర్నల్ మార్కులు కేటాయించనున్నట్లు విద్యాశాఖ పేర్కొంది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు.హా పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఉన్నాయా? లేవా? అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూశారు. ఇంటర్నల్ మార్కులను తొలగిస్తూ గత ఏడాది నవంబరులో ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే, ఇటీవల దిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(NCERT) నిర్వహించిన వర్క్షాప్లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. పాత విధానాన్నే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ప్రజా సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలి.

**ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలి**
**పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజు నిర్వహణ.**
**జిల్లా నలుమూలల నుండి 43 ఫిర్యాదులు నేరుగా జిల్లా ఎస్పీ కి సమర్పించిన ఫిర్యాదుదారులు.**
**ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ప్రజా సమస్యలపై ఆదేశాలు జారి.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును స్వీకరిస్తూ ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ కి, జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి నేరుగా పోలీసు ముఖ్య అధికారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి ప్రజా సమస్యలనకు సిబ్బందిని కేటాయించి త్వరితగతిన సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను విన్నవించిన ఫిర్యాదులలో భూ సమస్యలు, ఫోర్జరీ సమస్యలు, కుటుంబ కలహాల సమస్యలు, భార్యాభర్తల మధ్య గొడవ, తండ్రి కొడుకులు సమస్యలు, కేసుల పురోగతి, కేసుల దర్యాప్తు తదుపరివాటిపై సమస్యలను జిల్లా పోలీసు ముఖ్య అధికారికి నేరుగా ఫిర్యాదులను అందించి సమస్యలను విన్నవించుకున్నారు. ఈరోజు దాదాపు 43 మంది ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను తెలియజేయడం జరిగింది. సుదూర ప్రాంతాల వారు మరియు జిల్లా ఎస్పీకి నేరుగా సమాచారం అందించాలనుకునే వారు నేరుగా వాట్సప్ ద్వారా తమ సందేశాన్ని 8712659973 నెంబర్ కు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరూ రైతు బీమా చేయించుకోవాలన్న తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ తెలంగాణ ప్రభుత్వం రైతులందరికీ 5 లక్షల రూపాయల రైతు బీమా చేయిస్తున్నదని రైతులు18 -59 సంవత్సరములు (14-08-1966 నుంచి 14-08-2007 మధ్యలో పుట్టిన వారు) అర్హులని, కొత్తగా పాస్ బుక్ 05-07 2025 వరకు పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులందరూ అర్హులని అన్నారు. గత సంవత్సరం భీమా చేసుకున్నా రైతులు నామిని పేరు కానీ ఏదైనా కరెక్షన్స్ చేసుకోవాలనుకుంటే మండల వ్యవసాయ అధికారి వద్ద చేయించుకోవాలని అన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, నామిని ఆధార్ నంబరు, జిరాక్స్ ప్రతుల వివరాలు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా వ్యవసాయ అధికారికి ఆగస్టు 14వ తేదీ లోగా సమర్పించాలని శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు..

# ప్రభుత్వం ఏదైనా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ అన్నారు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇందులో భాగంగానే షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ లోని జడ్పీ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ టౌన్ 132 మావల. 9 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన కుటుంబానికి ఆర్థిక భారం నుండి కాస్త ఉపశమనం కలిగించేందుకు ఒక లక్ష నగదు ఎంతో కొంత దోహదపడుతోందని అన్నారు. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు సహకరించాలని కోరారు. పేదవారు ఆడపిల్లల పెళ్లిల్లు చేసేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే షాదీ ముబారక్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆర్డీవో స్రవంతి, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: కలెక్టర్



ఆదిలాబాద్ : అమృత్ తెలంగాణ: సమస్యలపై వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 78 వినతులను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను విన్నవిస్తు ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో ఇచ్చే అర్జీలను పరిష్కరించేల చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న వాటి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర, ఆర్డీఓ స్రవంతి, ఆయా శాఖల అధికారులున్నారు.

# ప్రతి ఒక్క విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సారంగాపూర్ మండలం చించోలి.బి సమీపంలోని ప్రభుత్వ బాలుర మైనారిటీ వసతి గృహ విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతనుకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. వానాకాలం అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ, పాఠశాల, వసతి గృహాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల అన్ని కమిటీలను విద్యార్థులచే నిర్వహించాలన్నారు. పదవతరగతి విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రతీ రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, ఇన్ చార్జి డీఈఓ పరమేశ్వర్, కార్యక్రమ నిర్వహణ అధికారికి నయానా రెడ్డి, వైద్యాధికారులు సౌమ్య, పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలి..




జన్నారం :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పనిసరిగా బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని బిసి ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. సోమవారం జన్నారంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అందుకు సహకరించడం లేదన్నారు.

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్లు బీసీలలో ఉన్న ముస్లింలను 10 శాతం రిజర్వేషన్ తీసివేస్తే 42 శాతం రిజర్వేషన్ కి మేము సహకరిస్తామని అనడం విడ్డూరమన్నారు. ఇది బీసీ ప్రజలను మోసం చేయడమే అన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే తప్పనిసరిగా 42 శాతం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు లేకుంటే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీఐఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీరాముల కొండయ్య, మంచిర్యాల డివిజన్ మోకు దెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నరస గౌడ్, నిర్మల్ జిల్లా బీ సీ కే ఎస్ కన్వీనర్ కోడి జుట్టు రాజయ్య, బీ సీ కే యూ పీ ఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ మామిడి విజయ్, కూడల శ్రీధర్, మహేంద్ర సంఘం నాయకుడు సంద గోపాల్, పూసల సంఘం జన్నారం మండల మాజీ అధ్యక్షుడు గుడ్ల రాజన్న, జన్నారం మండల తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్, ఆర్ టి సి యూనియన్ సీనియర్ నాయకుడు ఎ లచ్చన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల' వాణి ' వినని ప్రజావాణి ఎందుకు ?

## దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లిన పోలీస్ కానిస్టేబుల్లి సిబ్బంది





జగిత్యాల అమృత్ తెలంగాణ ఆగస్టు 11 జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సిబ్బంది,పోలీసుల అత్యుత్సాహం కనబరిచారు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మర్రిపెల్లి రాజ గంగారాం దివ్యాంగుడు తన ఇంటికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం ప్రజావానికి వెళ్ళడం జరిగింది,సమస్య వినకపోగా అక్కడ అధికారులు సిబ్బంది చేత రాజగంగారాంను బలవంతంగా కాళ్లు పట్టి లాగి ప్రజావాణి నుండి బయటకు ఈడ్చేశారు,అప్పుడే అక్కడనుండి వస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్ చూస్తూ పట్టనట్టు వెళ్ళిపోవడం కొసమెరుపు,సమస్యలకోసం అధికారుల దగ్గరకు వెళితే అధికారులు పట్టించుకోక పోతే ఇంకా ఎవరు పట్టించుకుంటారు,సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి,ప్రజల వాణి వినని ప్రజావాణి ఎందుకని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షా సమావేశం..



వేములవాడ :అమృత్ తెలంగాణ: వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్షించారు. హైదరాబాద్లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, పలు ఏజెన్సీల ప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమ కాలువ భూ సేకరణ, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి ప్రాజెక్టు పనులు, కోనరావుపేట మండల పరిధిలోని లచ్చాపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు, చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చేరువు, సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువుల్లోకి నీరు చేరే ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టులను సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు సాగునీరు సమయానికి అందేలా అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శకత, వ్యవసాయ ఉత్పాదకత పెంపు ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఈ సుధాకర్ రెడ్డి, ఈఈ సంతు ప్రకాష్ సహా ఇంజినీరింగ్ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థులకు ఆల్బొండజోల్ మాత్రలు వేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధిజాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని పురష్కరించుకుని జిల్లా కేంద్రం లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నులిపురుగులు ఎలా వ్యాపిస్తాయో డేమో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు . నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రం లోని కేజీబీవీ విద్యార్థులకు మాత్రలను సోమవారం మధ్యాహ్నం వేశారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

1 నుండి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖ తో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు , ప్రైవేట్ పాఠశాలలు ,కళాశాలల యాజమాన్యాలు ఈ రోజు మాత్రలు వేయడం జరుగుతుందని, పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం ,రక్తహీనత ,ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి కేంద్రాల లోనే మాత్రలు వేయాలని, ఇంటికి తీసుకెళ్లరాదని ఆన్నారు. జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు 2,06,127 మంది పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల రీజనల్ కో ఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వామ్యం తో విజయవంతం చేయాలనీ ఆన్నారు.

మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు విద్యార్థులకు వేయాలనీ,

ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వారికి సగం మాత్ర , రెండు సంవత్సరాలు ఆ పై 19 సంవత్సరాల వయసు గల వారికి ఒక పూర్తి మాత్ర నమిలి మింగాలని ఏదైనా కారణంతో 11 వ తేదీన మాత్రలు వేసుకోలేని వారు 18 వ తేదీన తప్పకుండా వేయించాలని ఆన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య శాఖాధికారి నరేందర్ రాథోడ్, డీఈఓ శ్రీనివాస్, సాధన, తదితరులు ఉన్నారు.

# దొడ్డు బియ్యం సరఫరాపై మంత్రి అడ్లూరి ఆగ్రహం



కరీంనగర్ :అమృత్ తెలంగాణ: పేద, ముఖ్యంగా ఎస్సీ విద్యార్థుల చదువులు, ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీ పడబోమని, గురుకులాలను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

సోమవారం ఆయన కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం చింతకుంట బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించిన మంత్రి, ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ దొడ్డు బియ్యం వాడటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద పిల్లలకు నాణ్యమైన అన్నం అందించాల్సిన అధికారులు ఇలా నిర్లక్ష్యం పై మండిపడ్డారు. గత 15 రోజులుగా దొడ్డు బియ్యం వండుతున్నారని ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో, మంత్రి వెంటనే కరీంనగర్ డి.ఎస్.ఓ.కు ఫోన్ చేసి వివరణ కోరారు. సరఫరా చేసిన దొడ్డు బియ్యాన్ని తక్షణం మార్చాలని ఆదేశించారు. అనంతరం సివిల్ సప్లయిస్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్తో మాట్లాడి, రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లకు దొడ్డు బియ్యం సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని హెచ్చరించిన మంత్రి, గురుకులాల్లో మెస్ పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అవుట్సోర్సింగ్ సిబ్బంది నియామకానికి చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అదనపు వాటర్ ప్లాంట్, స్టీల్ వంట పాత్రలు వారంలో ఏర్పాటు చేయాలని, స్కూల్ ప్రహరీ నిర్మాణం, క్యాంపస్ ఎలెక్ట్రిషియన్ నియామకం వారం రోజుల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. పిల్లల క్రీడా సదుపాయాల కోసం బాస్కెట్ బాల్ కోర్ట్, మైదానం అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించిన మంత్రి, విద్యార్థుల సమస్యలు తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. భోజన సమయానికి విద్యార్థులతో కూర్చుని అన్నం రుచి చూసిన ఆయన, విద్యార్థుల సంక్షేమం మా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం అని స్పష్టం చేశారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపిఎస్




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ప్రతీ అవకాశం ప్రజల కొరకే వినియోగిస్తున్నా..



అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ప్రజల సంక్షేమం పట్ల అంకితభావంతో ప్రతీ అవకాశాన్ని ప్రజలు కోసమే వినియోగిస్తున్నాను అని, ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఎంపికైన 38 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 13 లక్షల 15 వేల విలువైన చెక్కులను ఆయనే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు అర్హులైన వారికి ప్రభుత్వం అందించే సహాయం చేరేలా ఎల్లప్పుడు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.6 కోట్లు విలువైన సీఎం ఆర్ఎఫ్,అత్యవసర వైద్య సేవలు కోసం ఎల్ఓసీ లు అందించడం జరిగిందని తెలిపారు. ఆశ్రమ, గురుకులాల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెంపుదల కోసం వ్యక్తిత్వ వికాసం పెంపు కోసం మోటివేషన్ తరగతులు నిర్వహిస్తామని,ఈ నెల 14 న రక్త నిల్వ కేంద్రం ప్రారంభించడంతో పాటు రక్త సేకరణ శిబిరము ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం రక్త నిల్వ కేంద్రం కోసం కేటాయించిన గదిని,100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.

# బీసీ రిజర్వేషన్ కోసం బీఆర్ఎస్ కధన భేరి



కరీంనగర్ :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఈనెల 14న కరీంనగర్‌లో 'బీసీ కదన భేరి' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు.బీసీలకు అవకాశాలిచ్చింది కేసీఆరే: గంగుల కమలాకర్‌మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పుడు మోసపూరిత నాటకాలు ఆడుతోందని విమర్శించారు.

కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా?అని ప్రశ్నించారు. వంద మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. 'బీసీలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్‌టీసీ చైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బీసీలకే అవకాశం ఇచ్చింది కేసీఆర్' అని గుర్తుచేశారు. మంత్రులుగా కూడా బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తరపున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ బూటకపు హామీలు: తలసాని శ్రీనివాస్‌మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ%ొ% తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు గురుకులాలు ఏర్పాటు చేసి, కులవత్తులకు వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు.

బీసీల గొంతు నొక్కే కుట్ర: మధుసూదనచారిశాసనమండలి పక్ష నేత మధుసూదనచారి మాట్లాడుతూ.. బీసీల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీలకు న్యాయం జరగాలంటే తమిళనాడు తరహాలో పోరాడాలని తాము కాంగ్రెస్‌కు సూచించినట్లు చెప్పారు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడమే ఏకైక మార్గమని చెప్పారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బీసీల సంఖ్యను తక్కువగా చూపారని విమర్శించారు. కేంద్రానికి పంపిన ఆర్డినెన్స్ ముసాయిదాలో రాజకీయ రిజర్వేషన్ల అంశం మాత్రమే ఉందని, విద్య, వైద్యం వంటి ఇతర రంగాలను కావాలనే విస్మరించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బీసీల రిజర్వేషన్లు పెంచితే కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకున్న విషయం ప్రజలకు తెలుసని చెప్పారు.

సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనచారి, బండ ప్రకాష్, ఎల్.రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినరు భాస్కర్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కష్ణమోహన్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్‌బాబు, విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు బండ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, కరీంనగర్, సిరిసిల్ల బీఆర్ఎస్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీ ప్రణాళికతో కరీంనగర్ అభివృద్ధి..



కరీంనగర్ :అమృత్ తెలంగాణ: పకడ్బందీ ప్రణాళికతో కరీంనగర్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఒక మాడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణం, ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ఆధునీకరణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు. దాదాపు రూ.4.79 కోట్లతో మౌలిక వసతుల కల్పన.. ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. నాలుగు కోట్లతో సుడా వాణిజ్య భవన నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు కోట్లు మంజూరు అయ్యాయనీ, వాటితో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పనులు 79 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు నాణ్యతతో చేపట్టేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ జరపాలని సూచించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

ఇందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలో మిగిలిపోయిన పనులకు ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామనీ, ఆ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. అదేవిధంగా కరీంనగర్ కు తలమానికంగా నిలిచే మానేర్ రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ శాతవాహన యునివర్సిటీ లో తాము ఏర్పాటు చేసిన గ్రూపులతోనే యూనివర్సిటీ రన్ అయిందనీ, తమ ప్రభుత్వం వచ్చాక శాతవాహన యూనివర్శిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డీఓ మహేశ్వర్ మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, మృత్యుంజయం, జిల్లాఅధికారులు, , మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో రికార్డు వసూళ్లు..



రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారులు తమ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో రికార్డు స్థాయిలో పన్నులు, జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు. ?జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, మోటార్ వాహన తనిఖీ అధికారి వంశీధర్, కార్యాలయ నిర్వాహకురాలు కల్పన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రాష్ట్ర రవాణా కమిషనర్ సురేంద్ర మోహన్‌కు వివరాలు తెలియజేశారు. జిల్లా నుంచి మొత్తం 293 వాహనాలపై కేసులు నమోదు చేయగా, దీనికి గాను రాష్ట్ర రవాణా శాఖ నిర్దేశించిన రూ. 64 లక్షల లక్ష్యాన్ని అధిగమించి, 151% వసూళ్లతో రూ. 96,96,465 సేకరించినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటికీ 5088 సరుకు రవాణా వాహనాలు, ట్రాక్టర్ ట్రైలర్లు, ఇతర వాహనాలు పన్నులు చెల్లించలేదని అధికారులు తెలిపారు. ఈ వాహన యజమానులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తే ఎలాంటి జరిమానా లేకుండా కట్టవచ్చని, లేకపోతే రవాణా శాఖ తనిఖీలలో పట్టుబడితే 200% జరిమానాతో పన్ను చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలకు తప్పనిసరిగా బీమా, కాలుష్య నియంత్రణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. 15 సంవత్సరాలు పూర్తి అయిన సొంత పనులకు వాడే ద్విచక్ర వాహనాలు, కార్లకు తప్పనిసరిగా గ్రీన్ ట్యాక్స్, వాహన బీమా, కాలుష్య పత్రాలతో పునరుద్ధరణ చేసుకోవాలనీ జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న ఆటో డ్రైవర్‌కు బీఎన్.రావు ఫౌండేషన్ ఆర్థిక సహాయం

కరీంనగర్ :అమృత్ తెలంగాణ: కుక్కలను తప్పించబోయి ద్విచక్ర వాహనంపై నుండి పడి వెన్నుపూస విరిగిన ఒక నిరుపేద ఆటో డ్రైవర్‌కు డాక్టర్ బి.ఎన్.రావు ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వెంకట్రావుపల్లికి చెందిన కనుకుంట కుమార్ (40) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత ఆగస్టు 2న సొంత పనులపై ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయే క్రమంలో రోడ్డుపై పడిపోయి వెన్నుపూస విరిగింది. విషయం తెలుసుకున్న డాక్టర్ బి.ఎన్.రావు.. ప్రతిమ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని సోమవారం పరామర్శించి, తక్షణ సహాయం కింద రూ. 25 వేల చెక్కును కుమార్ భార్య భాగ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# తమన్నా తళుకు బెళుకులు.. చూస్తూ ఉండిపోవాల్సిందే..!



మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ మూవీ చంద్ స రోషన్ చెహ్రా సినిమాతో తెరంగేట్రం చేయగా శ్రీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత రెండేళ్లు తమిళ సినిమాల్లో నటిస్తూ వచ్చిన అమ్మడు మళ్లీ హ్యాపీడేస్ తో తెలుగులో నటించింది. హ్యాపీడేస్ సూపర్ హిట్ అవడంతో తమన్నాకి టాలీవుడ్ లో సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇక అక్కడ నుంచి ముందు యువ హీరోలతో నటించి ఆ తర్వాత స్టార్ ఛాన్సులు అందుకుంది అమ్మడు. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 20 ఏళ్ల కావొస్తున్నా ఇప్పటికీ యువ హీరోయిన్స్ కి పోటీ ఇస్తూ వరుస సినిమాలు చేస్తుంది తమన్నా. కేవలం హీరోయిన్ గానే కాదు అమ్మడు స్పెషల్ సాంగ్స్ కి కేరాఫ్ అడ్రెస్ గా మారింది. హీరోయిన్స్ లో కొద్దోగొప్పో డ్యాన్స్ చేస్తూ అలరించే తమన్నాతో జోడీ కట్టేందుకు స్టార్స్ కూడా ఆసక్తి చూపించారు. స్టార్ హీరోలతోనే కాదు సీనియర్ స్టార్స్ తో కూడా తమన్నా జత కట్టింది. చిరంజీవి నాగార్జున వంటి స్టార్స్ తో కూడా తమన్నా నటించింది. ఇప్పటికీ ఓ పక్క సీనియర్ ఫస్ట్ బెస్ట్ ఆప్షన్ గా తమన్నా తన సత్తా చాటుతుంది. మరోపక్క యువ హీరోలతో కూడా కలిసి చేసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుంది. తెలుగుతో పాటుగా తమిళ హిందీ పరిశ్రమల్లో కూడా తమన్నా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది.

# అతని ప్రవర్తనతో చాలా భయపడ్డా!

ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. సౌత్ లో కనిపించాలంటే హీరోయిన్ మరీ సన్నగా ఉండకూడదని, అలా ఉంటే తప్పని శరీరాకృతి విషయంలో తాను ఎన్నో ఛాలెంజెస్ ఎదుర్కొన్నట్టు మాళవికా తెలిపింది. ఒకప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని మాళవిక వెల్లడించింది. గతంలో తనపై వచ్చిన విమర్శలు తనను ఎంతగానో బాధించాయని చెప్తూ తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని మాళవిక బయటపెట్టింది. ఒకరోజు రాత్రి తాను ఫ్రెండ్స్ తో కలిసి ముంబైలోని లోకల్ ట్రైన్ లో జర్నీ చేశానని, ఆ జర్నీ టైమ్ లో తనని ఒకతని ప్రవర్తన చాలా భయపెట్టిందని మాళవికా మోహనన్ తెలిపింది. మరో సినిమాను ఓకే చేసిన ప్రభాస్ జర్నీ చేస్తున్న టైమ్ లో ఆ కంపార్ట్‌మెంట్‌లో తను, తన స్నేహితులు తప్ప ఎవరూ లేరని, ఆ టైమ్ లో ఒకతను తమ కంపార్ట్‌మెంట్ లోకి వచ్చేందుకు ట్రై చేశాడని, అక్కడున్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని, అతని ప్రవర్తన తనను, తన ఫ్రెండ్స్ ను భయపడేలా చేసిందని, ఆ టైమ్ లో అసలేం చేయాలో అర్థం కాలేదని మాళవిక వెల్లడించింది. అలా భయపడుతూ ఉండగా ట్రైన్ మరో స్టేషన్ కు వచ్చిందని, అక్కడ తమ కంపార్ట్‌మెంట్ లోకి మరికొంత మంది వచ్చాక తమ భయం మొత్తం పోయిందని మాళవిక తెలిపింది. ఇక హీరోయిన్ లుక్స్ విషయంలో కూడా మాళవిక మాట్లాడింది. కొంచెం బరువు పెరిగి నార్త్ లో సినిమా చేయాలనుకుంటే అక్కడ ఛాన్సులు రావని, నార్త్ సినిమా కోసం కొంచెం సన్నబడి తిరిగి సౌత్ కు వస్తే ఇక్కడ బొద్దుగా ఉంటేనే బావుంటావంటారని మాళవిక తనకు ఎదురైన అనుభవాలను చెప్పుకొచ్చింది. దీంతో ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తల్లో కన్ఫ్యూజ్ అయ్యానని, తర్వాత మెల్లిగా సిట్యుయేషన్స్ అర్థమయ్యాయని ఏదేమైనా ఫిట్‌గా, హెల్తీగా ఉండాలని డిసైడ్ అయినట్టు అమ్మడు తెలిపింది. తన కెరీర్ స్టార్టింగ్ లో సన్నగా ఉన్నానని ఎంతోమంది ట్రోల్ చేశారని, ఆ తర్వాత కొంచెం లావు అయ్యేసరిగా అప్పుడు కూడా తనను విమర్శించారని చెప్పిన మాళవిక దక్షిణాది హీరోయిన్లు ఎక్కువగా బొడ్డు మీదనే ఫోకస్ చేస్తారని, సోషల్ మీడియాలో కూడా బొడ్డు కనిపించేలా దిగిన ఫోటోలనే షేర్ చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది మాళవిక.



# హైబ్రిడ్ పిల్లతో అందుకే అందరికీ ఇబ్బంది!

సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. సాయి పల్లవిని సినిమాకు ఒప్పించాలంటే ఎంత కష్టమవుతుంది? అన్నది ఓ సందర్భంలో చందు మొండేటి ఎంతో ఓపెన్ గా చెప్పిన సంగతి తెలిసిందే. ఆమెతో కలిగిన అనుభవాన్ని చందు రివీల్ చేసాడు. ఆ సమయంలో కథ, పాత్రల విషయంలో సాయిపల్లవి రెయిజ్ చేసే డౌట్లు మామూలుగా ఉండవు..ఆమెతో ఎవరు సినిమా తీయాలన్నా? ఒప్పించాలన్నా వాళ్లకు చుక్కలు కనిపిస్తాయన్నారు. సాయి పల్లవిని ఒప్పించడం అంటే? ఏ డైరెక్టర్కి అయినా ఓ సవాల్ గానే ఉంటుందని తన అనుభవాన్ని చెప్పే ప్రయత్నం చేసారు. తాజాగా సాయి పల్లవి కథలను ఎలా ఎంచుకుంటుందో రివీల్ చేసింది ఎలాటి పాత్రలోనైనా దాని లోతెంత అని చూస్తా. ఆ పాత్రలో బరువైన భావోద్వేగం ఉందా? లేదా? అన్నది ఎక్కువగా చూస్తా. దాని మీద నాలో నేనే విశ్లేషణ చేసుకుంటా. నటిస్తే ఎలా ఉంటుంది అన్నది మాత్రం సీరియస్ గా ఆలోచన చేస్తా. అన్నది తర్వాత సంగతి ఆ పాత్ర ద్వారా ప్రేక్షకుల్లో ఎంత వరకూ గుర్తింపు వస్తుందన్నది చూసుకుంటా. ఎందుకంటే ప్రేక్షకులకు నిజాయితీగల కథలు మాత్రమే చెప్పాలి. ఏ పాత్ర పోషించినా అందులో భావోద్వేగానికి ప్రేకేక్షకులు కనెక్ట్ అవ్వాలి. అలా కనెక్ట్ కాలేనప్పుడు ఎంత గొప్ప పాత్ర పోషించినా అది వృధ్ధా ప్రయత్నమే అవుతుంది. అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమను గెలుచు కోవడం అన్నది గొప్ప విషయం. కానీ.. అవార్డుల గురించి ఎప్పుడు ఆలోచించను. ప్రేక్షకుల మెప్పు తర్వాత అవార్డులు వస్తే దాన్ని బోనస్ గా మాత్రమే భావిస్తాను. అలా అవార్డులకు రెండో ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. సాయిపల్లవి అందుకే తక్కువ సినిమాలు చేయగల్గింది. నటిగా తనకంటూ కొన్ని పరిమితులు విధించుకుని కొనసాగుతుంది. ప్రకటనల్లో కనిపించదు...గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కోట్లు ఇస్తామన్నా నో ఛాన్స్ అంటూ రిజెక్ట్ చేస్తుంది




# ది పర్ఫెక్ట్ బోల్డ్ బ్యూటీ..!



శ్రీదేవి కూతురు జాన్వి కపూర్ బోల్డ్ ఇమేజ్ సంపాదించేందుకు బాగానే కష్టపడుతుంది. సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సరే రెగ్యులర్ గా తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో తన మీద ఫోక మిస్ అవకుండా చేస్తుంది. అందుకే రోజు ఒక కొత్త అవతారంలో కనిపిస్తుంది. గ్లామర్ షోలో తనకంటూ ఒక ప్రత్యేక ఉందంటూ ఆమె చేస్తున్న స్కిన్ షో చూస్తేనే అర్థమవుతుంది. మడి కట్టుక్ కూర్చుంటే అవకాశాలు కష్టమే అందుకే గ్లామర్ గేట్లు పూర్తిగా ఎత్తేసి తన అందాలతో అలరించేస్తుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com